

అడుసు త్రొక్కనేల కాలు కడుగనేల

ఎ. వి. యల్. నరసింహారావు

బాగా తెల్లవారింది. బళ్ళో గంట గణగణా మ్రోగింది. పిల్లలంతా ఆడుకుంటూ పాడుకుంటూ, చెంగుచెంగున గంతులేస్తూ, సంతోషంగా పోతున్నారు బళ్లోకి.

సూర్యంమాత్రం కాళ్ళనుంచీ తలదాకా దుప్పటి తన్నిపట్టి దొంగ గురకపెట్టి నిద్రపోతున్నాడు. బళ్లోకి పోతే పంతులుగారు నిన్న చెప్పిన పాఠంలో ప్రశ్నలు వేస్తారు. జవాబు చెప్పలేకపోతే వీపు చిట్లిపోతుంది.

అమ్మడు గబగబా పాఠం చదువుకుపోతున్నది

"మంచిపిల్లవాడు పెందలకడనే లేచి పలుదోమి స్నానము చేయును. చక్కగా పాఠములు చదివి వేళకు బడికిపోవును"

సూర్యానికి కోపం వచ్చింది.

"అబ్బా, పాడుగోల! చెవికింద సొదపెట్టకు! అవతలకు పోతావా పోవా? వీపు పగులుతుంది"

"పోనా నన్నాయ్, 'అడుసు త్రొక్కనేల, కాలు కడుగనేల?' పాఠంరాకపోతే ... మరే ... వీపు పగులుతుందనే చెప్పారు పంతులు గారు."

"అమ్మడిపని మా తిమ్మక్కగా ఉందే" అంటూ సూర్యం ఒక్క దూకుతో వచ్చి, అమ్మడివీపు వంచి, దబదబా నాలుగుబాది, పోయి దుప్పటి కప్పుకొని, గురకపెట్టడం ప్రారంభించాడు.

వడమటింట్లో కాఫీ కలుపుతున్న అమ్మ యిదంతా కనిపెడుతూనే వుంది. ఒక్క అడుగులో చకచకా పెళ్లాలోకి వచ్చింది. సూర్యం వీపుమీద అయిదు వేళ్లూ వాతలు దేలాయి. నిద్రమైకం వదిలి సూర్యం ఉలిక్కిపడి లేచాడు. హడావిడిగా ముఖం కడుక్కొని కొంచెం కాఫీ పుచ్చుకొని అమ్మడి వెనకాల బడికి బయల్దేరాడు.

"అమ్మడూ, దోవలో అన్నాయి "అది కాదమ్మా, శ్రీ, చుక్కా పెట్టేటప్పుడు పంతులుగారెప్పుడూ నాకే 'శ్రీ' పెడతారని అన్నాయికి కోపమమ్మా, అందుకే తన్నారికే కొడతాడు."

"నా బంగారు తల్లే, ఇంటికొచ్చి నాతో చెప్పు, నేనున్నానుగా" అంటూ అమ్మ ఇంట్లోకి పోయింది. నిన్నెమైనా అంటే పంతులుగారితో చెప్పా..." అమ్మణ్ణి ముద్దుపెట్టుకొని చెప్పిందమ్మ.

సూర్యం అమ్మడివంక గుడ్లురిమి చూచాడు.

పందిరిగుంజకు కట్టేసిన ఆవుదూడ, తల్లిదగ్గర పాలు దాగడానికి వెళ్ళేతాడు అటూ ఇటూ లాక్కుంటూ మెల్లిగా సూర్యం చొక్కా కాస్తా నమిలేసింది.

బుజ్జాయంటే సూర్యానికి ఎంతో సరదా. వెళ్ళేతాడు విప్పదీసి

బుజ్జాయి మెడ తన సందిట్లో ఇరికించుకొని బజార్లోకి వచ్చాడు. ముందు అమ్మడూ, వెనక సూర్యం, సూర్యం సందిట్లో బుల్లిబుజ్జాయి అందాల మెడ.

తల్లిదగ్గరకు పోవాలని బుజ్జాయి తెగ పెనగులాడుతూఉంది. సూర్యం దాన్ని బడిదాకా తీసుకొచ్చాడు బలవంతంగా. అమ్మడు వద్దని చెపుతూనే ఉంది. ఉన్నట్టుండి బుజ్జాయి ఒక్క పెద్ద గంతేసి, సూర్యం చేతి పట్టువిడిపించుకొని, దుముక్కుంటూ పోయింది. ఆ విసు రాపుకోలేక సూర్యం బడి పక్కగానున్న పైడు కాలువలో పోయి పడ్డాడు. అమ్మడికి భయమేసింది.

బళ్లో కుర్చీలో కూర్చొని కిటికీ చువ్వల్లోనుంచి చూస్తున్న పంతులుగారికి ఇదంతా చక్కగా కనిపిస్తూనే ఉంది. "వాణ్ణిలా పడలాక్కురండిరా!" అంటూ ఇద్దరు కుఱ్ఱాళ్ళ వంక చూచాడు.

రేగిపోయిన జుట్టుతో, దోక్కుపోయిన మోకాళ్ళతో, బురదగొట్టుకున్న గుడ్డల్తో, పొర్లిపొర్లివచ్చే ఏడుపుతో సూర్యం పంతులుగారి ముందు హాజరయ్యాడు.

"దూడల్లే వీడు చదువుతున్నాడు చాలదూ! దాన్నొకదాన్ని వెంటబెట్టుకొచ్చాడు" పంతులుగారు గద్దించారు.

సూర్యం బావురుమని పెద్దగా ఏడ్చాడు.

"వెధవ! అడుసు తొక్కడ మెందుకు, కాలు కడుక్కోవడ మెందుకు?"

పంతులుగారు నిన్నటి పాఠమే అడుగుతున్నా రనుకొన్నాడు సూర్యం.

"పంతులుగారండీ, ఒక్కసారే చదివానండీ, పాఠం నోటికి రాలేదండీ" సూర్యం తల గోక్కుంటూ అన్నాడు.

"నీకు వస్తుందని నే ననుకున్నానా? వెళ్ళి బురద కడుక్కురా, బొక్కెనలో నీళ్లున్నయ్"

పిల్లలంతా రొదగా గందరగోళంగా చదవడం ప్రారంభించారు పాఠం. "తనకుగాని పనికి పోరాదు. పోయినచో ప్రమాదము తప్పదు. దూలపుకోతలో కాలుపెట్టి మేకూడదీసినకోతి మరణించెను. అడుసు త్రొక్కనపుడేవిచారింపవలయును. కాలు కడుగుకొనునపుడు విచారించి ప్రయోజనము లేదు"

కాళ్లు చేతులు కడుక్కొని వస్తున్న సూర్యంవంక పిల్లలంతా నవ్వుతూ చూచారు. అందర్నీ నమిలేద్దామన్నంత కోపం వచ్చింది సూర్యానికి. ముక్కు చివరదాకా జారిన కళ్లజోడు అద్దాలమీదుగా పంతులుగారి వాడిచూపులు సూర్యం కళ్ళల్లోకొచ్చి గుచ్చుకున్నాయి. పిల్లిలాగాపోయి సూర్యం అమ్మడి పక్కన ముడుచుకూర్చున్నాడు.

"ఓరోయ్ సూరీ, అడుసు అంటే ఏమిటిరా?" పంతులుగారు ప్రశ్నించారు.

సూర్యం "జబా బకదించవా" అన్నట్లు అమ్మడివంక జాలిగా చూచాడు.

"ఏరా సూరీ, లేచి నిలబడు" ఖంగున మోగింది పంతులుగారి పెద్ద గొంతు. అమ్మడి గుండె తరుక్కుపోయింది. "అడుసంటే బురదన్నాయ్, చెప్పు" మెల్లిగా, సూర్యం వైపుకు జరిగి చెప్పింది.

సూర్యానికి అమ్మడిమీద పట్టరాని కోపం వచ్చింది.

"బురదలో పడ్డానని ఎగతాళి చేస్తావటే, ఇంటికి పద, నీ పని చెప్తా"

"ఏమిటిరా సూరీ, నసుగుతున్నావ్?" మళ్ళీ మోగింది పంతులుగారి పెద్దగొంతు. సూర్యం ఒక నిమిషం ఆలోచించాడు.

"ఆఁ...ఆఁ...అడుసంటే...అడుసంటే...అరిశండీ" అంటూ పందెం గెలుచుకున్నట్లు గర్వంగా చూచాడు అమ్మడివంక.

"తిండిపోతు వెధవ, అంతకంటే ఏమి తెలుస్తుంది నీకు," వెనక్కి తిప్పివున్న సూరి నున్నని పల్చని వేళ్ళమీద పంతులుగారి రూళ్ళకఱ్ఱ టకటకా మోగింది. సూర్యం కెవ్వున కేకపెట్టాడు. అమ్మడికళ్లల్లో గిఱ్ఱున తిరిగాయ్ నీళ్లు.

ఒక్క క్షణంలో బడంతా నిశ్శబ్దం.

"నెక్స్ట్, తర్వాత ఎవడురా, పద్యం అప్పజెప్పు"

కృష్ణబాబు హుషారుగా లేచి

పంచతంత్రం

బొమ్మల కథల పుస్తకం

మొదటి భాగం

(మిత్రభేదం, మిత్రలాభం)

కర్త: కీ॥ శే॥

విశ్వాత్ముల నరసింహమూర్తి

వెల: రూ. 1-8-0

ఆంధ్రగ్రంథమాల మద్రాసు.

అడుసు త్రొక్క నేల? కాలు కడుగ నేల?

మొదలెట్టాడు, సూర్యంవంక చూస్తూ.

"కుడిచి కూర్చుండ కింటిలో గోల చేసి
గిల్లి కజ్జాలు తెచ్చి యాగీలు పెంచి
వీపు చిట్లిన నేడ్తురా వెఱ్ఱితండ్రి!
అడుసు త్రొక్కంగనేల, కాల్గడుగ నేల?"

పిల్లలంతా సూర్యంవంక చూచి గొల్లుమని నవ్వారు. సూర్యం ఏడుపు ఆపుకోలేక పోయాడు. "బైటికి రండి మీ పని చెప్తా" అనుకున్నాడు.

బళ్ళో గడియారం పదిగొట్టింది. గంట గణగణా మ్రోగింది. "పొండిరా, పిల్లలందరూ" పంతులుగారు సెలవిచ్చారు. ఒక పెద్ద జలపాతంలాగా పిల్లలంతా గోదచేసుకుంటూ బైటకు దూకారు.

పంజరంనుంచి బైటపడ్డ రామచిలుకలా సూర్యం మనస్సు మహానందంతో పొంగిపోయింది. పుస్తకాలు సర్దుకుంటున్న అమ్మడి పొట్టిజడ గట్టిగా లాగి కోడెదూడలా గంతులేస్తూ బైటకొచ్చాడు. పిల్లల వీపులు చరుస్తూ, మొడలువంచి మొట్టికాయలేస్తూ, వాళ్ళు కొట్టవస్తే అందకుండా వీధి అరుగులెక్కి పరుగెత్తుతూ, పోయిపోయి రచ్చబండలదగ్గరాగి అటూ ఇటూ చూచాడు.

ఆ ప్రక్కనే వేపచెట్టు నీడకు మాగన్నుపెట్టి వెనక కాళ్ళమధ్య తోకముడుచుకు పండుకున్న ఆబోతు కనిపించింది సూర్యానికి. పిల్లల్నందర్నీ చేరబిల్చాడు. "మాంచి గమ్మత్తు చేస్తున్నాను చూడండోయ్" అంటూ మెల్లిగా ఆబోతు వెనగ్గా వచ్చాడు. నర్రున దాని తోక చేత్తోలాగి, బలంకొద్దీ గట్టిగా మెలిపెట్టివేశాడు. మాగన్నుపెట్టి కునుకుదీస్తున్న బసవన్న దిగ్గున లేచాడు. తోక పైకెత్తి, ఒళ్లు విరుచుకొని ఖణిల్లున రంకెపెట్టాడు.

పిల్లలంతా కవ్విస్తూ ఎగబడి వెంటబడ్డారు. ఆబోతు గంగడోలు అటూ ఇటూ ఊపుకుంటూ, కోర కొమ్ములు విసురుకుంటూ, పిల్లల మధ్యగా బయలుదేరింది.

వెనకచిక్కిన అమ్మడు ఆబోతును చూచి కెవ్వున కేకపెట్టింది. పరికిణీ కుచ్చెళ్లు అమ్మడి కాళ్ల కడ్డుపడ్డాయి. బసవన్న మళ్ళీ రంకెపెట్టాడు. అమ్మడు బోర్లపడ్డది. ఆబోతు అమ్మడికి దగ్గరగా వచ్చి నక్లింది. అమ్మడి కళ్లు బైర్లు కమ్మాయి.

ఒక పావుగంటవరకూ ఏం జరిగిందో అమ్మడికి తెలియనే తెలియదు. కళ్లువిప్పి చూచేసరికి ఇంట్లో తాను మంచంమీద పండుకొని ఉంది. ప్రక్కన అమ్మా, నాన్నా ఒళ్ళు నిమురుతూ కూర్చున్నారు.

"పిచ్చితల్లీ, ఎంతపాటు పడ్డావే" అంటూ అమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నది.

సూర్యం తలుపు చాటున ఉండి అంతా చూస్తూనే ఉన్నాడు.

"అసలా పోట్ల ఆంబోతును కదిలించిందెవరమ్మడూ" నాన్న గట్టిగా అడిగాడు, దొక్కుపోయిన అమ్మడు వెలాతేలా నవ్విరిస్తూ.

అమ్మడు చెప్పేస్తుందని సూర్యం గుండె దడదడలాడింది. అమ్మడు చెప్పింది. "ఎవరో అబ్బాయి నాన్నా, అన్నాయి గాదు—అయినా నాకిప్పు డేమీ దెబ్బ తగల్లేదుగా"

సూర్యానికి అమ్మణ్ణిచూస్తుంటే ఏడుపు వచ్చింది. ఒక్కసారి పోయి అమ్మణ్ణి ముద్దుపెట్టుకుందా మనిపించింది. అమ్మా, నాన్నా అవతలకు పోయిందాకా ఆగాడు. మెల్లిగా వచ్చి అమ్మడి పక్కన కూర్చొన్నాడు.

"అన్నాయ్, నీ కేమన్నా దెబ్బ తగిలిందా!" అమ్మడు చిన్నగా అడిగింది. సూర్యం కళ్ళవెంట జోట జోటా నీళ్ళు కారాయ్.

"నీవెంత మంచిదానవమ్మడూ, నామూలంగానేగా నీకీ దెబ్బ తగిలింది"

అమ్మడికెందుకో నవ్వొచ్చింది. బళ్లో పంతులుగారు చెప్పిన పద్యం గుర్తుకు వచ్చింది. సూర్యం జుట్టులోకి వేళ్లు పోనిస్తూ మెల్లిగా చదివింది:

"కుడిచి కూర్చుండ కింటిలో గోల చేసి
గిల్లి కజ్జాలు తెచ్చి యాగీలు పెంచి
వీపు చిట్లిన నేడ్తురా వెఱ్ఱితండ్రి!
అడుసు త్రొక్కంగనేల కాల్గడుగ నేల?"

సరేగాని, ఇందులో వెఱ్ఱితండ్రి అంటే ఎవరన్నాయ్" అమ్మడు పకపకా నవ్వింది.

చావిట్లోఉన్న అమ్మా, నాన్నా ఆ మాటలు వింటూ లోపల్లోపల ఊరికే మురిసిపోతున్నారు. ★